# క్షణక్షణం.. భయం భయం

- విరిగిపోయిన రెయిలింగ్స్
- ప్రమాదకరంగా వంతెనలు

**మామిడికుదురు:** డ్రైన్లు, పంట కాలువలపై పలు చోట్ల గతంలో నిర్మించిన వంతెనలకు రెండు వైపులా ఉన్న రెయిలింగ్స్ విరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. దీంతో వాహనదారులు, స్థానికులు క్షణ క్షణం భయం భయంగా ప్రమాదకరంగా మారిన వంతెనలపై ప్రయాణం సాగిస్తున్నారు. నగరం గ్రామంలోని పెట్రోల్ బంక్ సమీపంలో తాటిపాక సరిహద్దు వద్ద ప్రధాన రహదారిలో పంట కాలువపై నిర్మించిన వంతెన పూర్తిగా శిథిలమైంది. గతంలో ఇక్కడ ప్రమాదం జరిగి ఒక వ్యక్తి కూడా మృత్యువాత పడ్డాడు. ఆ వంతెన పాడైపోయి చాలా కాలమైనా దానికి ఇప్పటికీ మోక్షం లభించలేదు. మొగలికుదురు నుంచి గెద్దాడ వెళ్లే మార్గంలో ఆర్అండ్‌బీ రోడ్డుపై పంట కాలువపై నిర్మించిన వంతెన పరిస్థితి కూడా చాలా దారుణంగా ఉంది. ఈ మార్గంలో రోడ్డు వెడల్పు పెరిగిన పూర్వపు వంతెన వెడల్పు చేయకపోవడంతో ఇక్కడ ప్రమాదం పొంచి ఉంది.

**ఆ మూడు చోట్ల ఇదే పరిస్థితి...**

నగరం గ్రామంలోని వానరాశి వారి మెరకలో వాడ్రేవుపల్లి మీడియం డ్రైన్‌పై నిర్మించిన బళ్ల వంతెన పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. ఈ వంతెనకు రెండు వైపులా రెయిలింగ్ విరిగిపోయాయి. ఇక్కడ కూడా ప్రమాదం పొంచి ఉంది. లూటుకుర్రు నుంచి బాడిలంక వెళ్లే మార్గంలో వాడబోది మీడియం డ్రైన్‌పై పూర్వం నిర్మించిన వంతెనకు రెండు వైపులా రక్షణ స్తంభాలు విరిగిపోయాయి. ఇక్కడ డ్రైన్ చాలా లోతు కావడంతో ఈ వంతెనపై ప్రయాణం చేయాలంటేనే స్థానికులు భయపడుతున్నారు. పాశర్లపూడిలంక వెళ్లే ప్రధాన మార్గంలో డ్రైన్‌పై నిర్మించిన వంతెన పరిస్థితి కూడా ఇంచుమించు ఇదే విధంగా ఉంది. ఈ వంతెనకు రెండు వైపులా రెయిలింగ్స్ విరిగిపోయి ప్రమాదాన్ని సూచిస్తున్నాయి. ఆయా వంతెనల పరిస్థితిని గమనించి అక్కడ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. రెయిలింగ్స్ పునర్నిర్మాణంతో పాటు వంతెనల వెడల్పునకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఆ దిశగా అధికారుల స్పందించాలన్న డిమాండ్ వినిపిస్తోంది.


లూటుకుర్రులో రెయిలింగ్స్ విరిగిపోయిన వంతెన


ప్రమాదకరంగా మారిన నగరం వానరాశివారి మెరక వంతెన

## కవితలకు నగదు బహుమతులు

**సఖినేటిపల్లి:** ఈ నెల 21న ప్రపంచ కవితా దినోత్సవం, 30న విశ్వావసు ఉగాది పర్వదినం పురస్కరించుకుని శ్రీశ్రీ కళావేదిక సీఈఓ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో కవితల పోటీల విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. గురువారం ఈ మేరకు సఖినేటిపల్లిలో ఆయన మాట్లాడుతూ, సామాజిక ఇతి వృత్తం కలిగిన కవిత ఏదైనా రాయవచ్చన్నారు. రాసిన కవితలను శ్రీశ్రీ కళా వేదిక వాట్సాప్ గ్రూపులలో మాత్రమే పోస్టు చేయాలని సూచించారు. కవితలు ఈ నెల 16 పోస్టు చేయాల్సిన ఆఖరు తేదీగా నిర్ణయించినట్టు వెల్లడించారు. విజేతలకు బహుమతులను రాజమహేంద్రవరంలో ఈ నెల 23న వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో అందజేయనున్నట్టు ప్రతాప్ పేర్కొన్నారు. కాగా ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతులుగా నగదు రూ.2 వేలు, రూ.1500, రూ.1000, రూ.600, పది మందికి రూ.500 చొప్పన కన్సొలేషన్ బహుమతులు, జ్ఞాపికలు ఉంటాయన్నారు. వివరాలకు మొబైల్ నంబర్లు 9908066242, 9866481047 సంప్రదించాలని కోరారు.

## క్లుప్తంగా

### చిన్నారుల దాతృత్వం


ఆశ్రమంలో వృద్ధులతో చిన్నారులు

**మలికిపురం:** విశ్వేశ్వరాయపురంలోని వివేకానంద ఉన్నత పాఠశాల విద్యార్థులు మానవత్వం చాటారు. ఈ విద్యార్థులు కిడ్డీ బ్యాంక్‌లో దాచుకున్న డబ్బులతో అనాథ వృద్ధులకు గురువారం భోజనం ఏర్పాటు చేశారు. సుమారు రూ.5 వేలు వెచ్చించి చేపల పులుసు, స్వీట్, 2 రకాల కూరలతో భోజనం స్వయంగా వడ్డించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. రోజంతా వారితో గడిపారు. కార్యక్రమం నిర్వహించిన విద్యార్థులను పాఠశాల కరెస్పాండంట్ పీవీవీ వరప్రసాద్ అభినందించారు. మిగిలిన తరగతుల విద్యార్థులు కూడా రానున్న రోజుల్లో అనాథ వృద్ధులకు భోజనాలను ఏర్పాటు చేయనున్నారని, వీరిని ఆదర్శంగా తీసుకొని వృద్ధులకు సహాయం చేయుటకు మిగిలిన విద్యార్థులు కూడా ముందుకు రావాలని ప్రసాద్ కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.రాజేష్, తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు.

### ముందస్తు హోలీ సంబరాలు

**మామిడికుదురు:** హోలీ పండగను పురస్కరించుకుని మామిడికుదురులో విద్యార్థులు గురువారం సందడి చేశారు. దీప్తి స్కూల్లో విద్యార్థులు రంగులు చల్లుకుంటూ ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. రంగుల బెలూన్లు ఎగురవేశారు. ముందస్తు హోలీ సంబరాల్లో చిన్నారులు ఆద్యంతం ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ఒకరికొకరు రంగులు పూసుకుంటూ సంబరాలను హోరెత్తించారు. విద్యా సంస్థల అధినేత డీవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

### పేద కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

**మలికిపురం:** మండలంలోని అడవిపాలెంలో తాడి భవానిది నిరుపేద కుటుంబం. ఉండటానికి ఇల్లు లేదు. స్థానిక అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్లో ఒక చిన్న రూమ్‌లో ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్న ఆమెకు యేసు క్రీస్తు కృప సంఘం ద్వారా రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని గురువారం అందించారు. సంస్థ ప్రతినిధుల ద్వారా ఈ సాయం అందించారు. కార్యక్రమంలో గొల్లమందల శ్యామ్‌కుమార్, గొల్లమందల రాజబాబు, నక్క శ్యామ్, సహదేవ్ తాడి, నల్లి సత్యనారాయణ, గోనమండ సుధీర్, గొల్లమందల రాజేష్, కందికట్ల శ్రీను, కందికట్ల మోషే చేతుల మీదగా అందజేశారు.

### విద్యార్థులకు పరీక్ష కిట్ల పంపిణీ


విద్యార్థులకు కిట్లు అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

**మలికిపురం:** కేశనపల్లి ఉన్నత పాఠశల పరిధిలో కేశనపల్లి, గొల్లపాలెం, పడమటిపాలెం, గూడపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్ష కోసం సహృదయ ఫౌండేషన్ ప్రాజెక్ట్ శిక్షా–2025లో భాగంగా పరీక్షల మెటీరియల్‌ను గురువారం పంపిణీ చేశారు. వృత్తి రీత్యా ఇజ్రాయెల్‌లో ఉంటున్న పడమటిపాలెం గ్రామస్తులు ఫౌండేషన్ సభ్యులు తాడి చిట్టిబాబు ఆర్థిక సహాయంతో (ఎగ్జాం ప్యాడ్, పెన్, పెన్సిల్, స్కేల్, ఎరేజర్) కిట్లను సుమారు 200 మంది విద్యార్థులకు పంచారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మలికిపురం ఎంపీడీఓ జి.మల్లికార్జునరావు హాజరై పరీక్షలకు ముందు మానసిక ఒత్తిడి లేకుండా, ప్రశాంతంగా ఉండాలని సూచించారు. గ్రామ సర్పంచ్ ఎనుముల నాగు, హెచ్ఎం ఎస్.ఉమమహేశ్వరరావు, ఎంఈవో విజయశ్రీ, తాడి నాగేశ్వరరావు, ఎడ్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

**అంబాజీపేట:** మండలంలో అంబాజీపేట సబ్‌స్టేషన్ పరిధిలోని వాకలగరువు ఫీడర్‌లోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాంబాబు ప్రకటనలో తెలిపారు. వాకలగరువు, నందంపూడి, తొండవరం, పోతాయిలంక, సాకుర్రు గున్నేపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. 11 కేవీ విద్యుత్ లైన్లు మరమ్మతులు చేపట్టనున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

**అయినవిల్లిలో..**

**అయినవిల్లి:** మండలంలోని అయినవిల్లి సబ్‌స్టేషన్ పరిధిలో 5 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాంబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని అయినవిల్లి, ముక్తేశ్వరం, తొత్తరమూడి, వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సయమంలో విద్యుత్ లైన్‌లో మరమ్మతులు నిర్వహిస్తామన్నారు. సిబ్బందికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

# సంజీవయ్య జీవితం ఆదర్శం


స్టాలిన్‌బాబు రచించిన సంజీవయ్య జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి

**అంబాజీపేట:** నిరుపేదల పక్షాన నిలిచి తన జీవితాన్ని వెచ్చించిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రిగా ఖ్యాతిగాంచిన దామోదరం సంజీవయ్య ఆదర్శనీయులని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నేలపూడి స్టాలిన్‌బాబు అన్నారు. స్టాలిన్‌బాబు పుట్టినరోజు సందర్భంగా అంబాజీపేటలో ఆయన స్వగృహం వద్ద స్టాలిన్‌బాబు రచించిన 'చిరస్మరణీయుడు దామోదరం సంజీవయ్య' పుస్తకాన్ని సూర్యారావు గురువారం ఆవిష్కరించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సూర్యారావు మాట్లాడుతూ సామాజిక రాజకీయ అంశాలపై తనదైన శైలిలో రచనలు చేస్తూ సమాజంపై అంకితభావంతో ముందుకు వెళుతున్న స్టాలిన్‌బాబు సేవలను ఆయన కొనియాడారు. స్టాలిన్ బాబు జన్మదిన సందర్భంగా ఏర్పాటు చేసిన కేకును కట్ చేసిన అనంతరం దుశ్శాలువా, బొకేతో నాయకులు అభినందనలు తెలిపారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, పార్టీ జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, ముత్తాబత్తుల ప్రశాంత్, వాసంశెట్టి పెదబాబు, చింతపల్లి వెంకటేశ్వరరావు, మైలా ఆనందరావు, కుడుపూడి విద్యాసాగర్, నెల్లి దుర్గాప్రసాద్, కుసుమ శ్రీను పాల్గొన్నారు.

# గ్యాస్ లీకేజీ ప్రాంతంలో ఎమ్మెల్యే పర్యటన


గొల్లపాలెం జీసీఎస్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

**మలికిపురం:** మండలంలోని గొల్లపాలెంలో తూర్పుపాలెం గ్రూప్ గేదరింగ్ స్టేషన్‌లో లీకైన విషపూరితమైన హైడ్రోజన్ సల్ఫైడ్ వాయువు లీకేజీతో అస్వస్థతకు గురైన ప్రాంతాన్ని గురువారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పర్యటించారు. గ్రామంలో దాదాపు 10 మంది వరకు అస్వస్థతకు గురయ్యారు. వారిని ఎమ్మెల్యే పరామర్శించి సంఘటన ఏ విధంగా జరిగిందో స్థానికులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు ఓఎన్జీసీ తరపు నుంచి ఆర్థిక సాయాన్ని కూడా చేయిస్తానని తెలిపారు. జీసీఎస్‌కు వెళ్లి అధికారులను సంఘటనకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటన పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని జీసీఎస్ దగ్గరలో ప్రాథమిక వైద్యం అందే విధంగా హాస్పిటల్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, సర్పంచ్ మందపాటి నాగేశ్వరరావు, ఎంపీటీసీ మట్టా అనంతలక్ష్మి, గుండుమేను సూరిబాబు, తూపాటి నాగేశ్వరరావు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# వైద్యాధికారి సేవలు అద్వితీయం


భవానీశంకర్‌ను సత్కరిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

**ఆలమూరు:** మండలంలోనున్న పెదపళ్ల పీహెచ్‌సీలో గత ఐదేళ్లుగా సేవలు అందించిన వైద్యాధికారి పి.భవానీశంకర్ ప్రజలకు అందించిన సేవలు అద్వితీయమని స్థానిక రాజకీయ నాయకులు అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారి డి.సాయికిశోర్ ఆధ్వర్యంలో ఇటీవల రాజమహేంద్రవరం బదిలీపై వెళ్లిన పూర్వ వైద్యాధికారి భవానీ శంకర్ వీడ్కోలు సభను వైద్య ఆరోగ్య సిబ్బంది గురువారం ఘనంగా నిర్వహించారు. పెదపళ్ల వైద్యాధికారిగా పనిచేసింది కొద్ది కాలమే అయినా ప్రజలు అందించిన సంపూర్ణ సహకారం మరువలేనిదని భవానీ శంకర్ అన్నారు. బదిలీపై వెళ్లి నెలలు గడుస్తున్నా తనను గుర్తించుకొని ఆత్మీయ సత్కారం అందించిన రాజకీయ నేతలకు, వైద్యారోగ్య సిబ్బందిని చిరకాలం రుణపడి ఉంటానన్నారు. అనంతరం అఖిలపక్ష పార్టీ నేతలు, వైద్యారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పూల మాలలు వేసి శాలువా కప్పి మెమెంటో బహూకరించి సత్కరించారు.

# వాడపల్లి వెంకన్నను సన్నిధిలో 'సోము'


వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోము వీర్రాజు దంపతులు

**కొత్తపేట:** బీజేపీ రాష్ట్ర శాఖ మాజీ అధ్యక్షుడు, ఆ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి సోము వీర్రాజు ఆత్రేయపురం మండలం వాడపల్లి వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. రాష్ట్రంలో ఐదు ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థిగా సోము వీర్రాజు ఖరారు కాగా ఆయన ఈ నెల 10న నామినేషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. వీర్రాజు ఎమ్మెల్సీగా ఏకగ్రీవమయ్యారు. కాగా సోము వీర్రాజు గురువారం సతీసమేతంగా వాడపల్లి వేంకటేశ్వరస్వామి దర్శనానికి రాగా ఆలయ సంప్రదాయం ప్రకారం ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంతశ్రీనివాస్, అర్చకులు, దేవస్థానం సిబ్బంది స్వాగతం పలికారు. స్వామి దర్శనానంతరం వేదాశీర్వచనంతో స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఆయన వెంట కొత్తపేట మండల బీజేపీ అధ్యక్షుడు సంపతి కనకేశ్వరరావు తదితరులు ఉన్నారు.

# మోరి పాఠశాలకు ఫర్నిచర్ బహూకరణ

**సఖినేటిపల్లి:** మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకూ 1988–93 బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థులు కలిపి పాఠశాలకు రూ.40 వేలు విలువచేసే ఫర్నిచర్ గురువారం బహూకరించారు. పూర్వ, సహచర విద్యార్థిని ఉంగరాల మంగతాయారు జ్ఞాపకార్థం మిత్రులు, పూర్వవిద్యార్థులు పై మొత్తాన్ని సమకూర్చారు. ఈ మేరకు సమకూర్చిన ఫర్నిచర్‌ను, పాఠశాల హెచ్ఎం ఎస్.శ్రీధర్‌కృష్ణకు వారు అందజేశారు. ప్రముఖ గుండెవైద్య నిపుణుడు కెసిఎంఎల్ శ్రీనివాస్, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు ముప్పర్తి నాని, మోరి, మోరిపోడు సర్పంచ్‌లు పి.లక్ష్మీ పద్మ మంగతాయారు, ఎం.అలివేలు గంగా త్రివేణి, ఎంపీటీసీలు జాన లక్ష్మీ దుర్గ సూర్యావతి, బళ్ళ సుభాషిణి, ఎస్ఎంసీ చైర్మన్ గుబ్బల శ్రీలక్ష్మి పాల్గొన్నారు.


మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఫర్నిచర్ బహూకరిస్తున్న పూర్వ విద్యార్థులు

## ప్లాస్టిక్ వద్దు.. స్టీలే ముద్దు


దాత సతీష్‌ను సత్కరిస్తున్న ఎస్ఎంసీ కమిటీ

**ఆలమూరు:** మండలంలోని సంధిపూడిలోనున్న మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు స్టీల్ వాటర్ బాటిళ్ల పంపిణీ జరిగింది. పాఠశాలలో విద్యార్థులందరూ ప్లాస్టిక్ బాటిళ్లు వాడుతుండటం వల్ల భవిష్యత్‌లో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయనే ఉద్దేశంతో వ్యాపారవేత్త సూరపురెడ్డి సతీష్ గురువారం సుమారు 50 మంది విద్యార్థులకు రూ.25 వేల విలువైన స్టీల్ బాటిళ్లను పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ తోట భవానీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు ఎన్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను, స్టీల్ బాటిళ్ల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. పాఠశాల ఆవరణలో ఎస్ఎంసీ కమిటీ ప్రతినిధులు తోట వెంకటేశ్వర్లు, గుత్తుల దుర్గాప్రసాద్, ముచ్చర్ల రత్నకుమారి ఆధ్వర్యంలో దాత సతీష్‌కు ఘన సత్కారం జరిగింది.

## స్వామి సన్నిధిలో నటుడు శ్రీకాంత్

**సఖినేటిపల్లి:** అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం ప్రముఖ సినీ నటుడు శ్రీకాంత్, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.ఆలయ మర్యాదలతో అర్చకులు శ్రీకాంత్‌కు స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు పలికి, స్వామి చిత్రపటం అందజేశారు.

## పంట కాలువ పరిశీలన

**అయినవిల్లి:** మండల పరిధిలోని మాగాం–అయినపురం కాలువను గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ పరిశీలించారు. అలాగే మండలంలోని ప్రముఖ క్షేత్రమైన అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారిని గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముమ్మిడివరం మండలం సోమిదేవరపాలెంలో ఇరిగేషన్ ఏఈఈ, అగ్రికల్చర్ ఏడీ, అగ్రికల్చర్ ఏఓలతో సంబంధిత అధికారులతో కలసి డ్రైన్‌ను పరిశీలించారు. అక్కడ రైతుల సమస్యలు విని వెంటనే జేసీబీ ద్వారా పూడిక చెత్తను తొలగించి, ఆయిల్ ఇంజిన్ ద్వారా పంట పొలాలకు నీరు అందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అయినవిల్లి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కాకర శ్రీనివాస్, ముమ్మిడివరం నీటి సంఘం అధ్యక్షుడు సరిపల్లి శ్రీనివాసరాజు, అయినాపురం నీటి సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## సారా విక్రేత అరెస్ట్

**ఆలమూరు:** స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఆలమూరు మండలంలోని నర్సిపూడిలో గురువారం పోలీసులు నిర్వహించిన దాడుల్లో సారా విక్రేత జి.సుబ్బారావును అరెస్ట్ చేశారు. స్థానిక ఎక్సైజ్ సీఐ ఐడీ నాగేశ్వరరావు కథనం ప్రకారం గ్రామంలో సారా విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో సారా విక్రేత సుబ్బారావును అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నిందితుడు సుబ్బారావును గురువారం హాజరుపరచగా జడ్జి 14 రోజుల రిమాండ్ విధించారు. ఎక్సైజ్ ఎస్సై పి.రాంబాబు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## షెడ్యూల్డ్ కులాల కార్మికులకు ఒక రోజు శిక్షణ

**సఖినేటిపల్లి:** సఖినేటిపల్లిలో గురువారం ఆక్వా కల్చర్ చెరువులలో బయో సెక్యూరిటీ, వ్యక్తిగత పరిశుభ్రతలపై షెడ్యూల్డ్ కులాల కార్మికులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఎంపెడా సబ్ రీజినల్ డివిజన్ సౌజన్యంతో నేషనల్ సెంటర్ ఫర్ సస్టెయినబుల్ ఆక్వా కల్చర్ సహకారంతో వ్యవసాయం, మత్స్యవృత్తిలో ఉన్న పై కార్మికులకు ఈ శిక్షణ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బయో సెక్యూరిటీ కిట్లను వారికి పంపిణీ చేశారు. సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, మత్స్యశాఖ జేడీ ఎన్.శ్రీనివాస్, ఆక్వా జేటీవో డాక్టర్ వై.బంగారమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

**మామిడికుదురు:** అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు రాజోలు మండలం శివకోడు గ్రామానికి చెందిన ఆరుమిల్లి వెంకట సత్యనారాయణ మూర్తి, జ్యోత్స్నాదేవి దంపతులు గురువారం రూ.1,00,116లు విరాళంగా ఇచ్చారు. ఈ విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. దాతలకు అర్చకులు వేద ఆశీర్వాదం అందించారు. ఆలయ ఈఓ ఆధ్వర్యంలో వారికి స్వామి చిత్రపటంతో పాటు ప్రసాదాలు అందజేశారు.

# 16న ఉచిత వేరికోస్ వీన్స్ వైద్య శిబిరం

**కొత్తపేట:** స్థానిక సత్యసాయి సేవా కేంద్రంలో ఈ నెల 16 (ఆదివారం) ఉచిత వేరికోస్ వీన్స్ (ఉబ్బిన సిరలు) వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కంకటాల సత్యనారాయణ (కేఎస్ఎన్) తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భారతదేశపు అతి పెద్ద ఏషియన్ వాస్కులర్ (వేరికోస్ వీన్స్) హాస్పిటల్స్ వారి సౌజన్యంతో ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉబ్బి మెలికలు తిరిగిన నరాలు, సాలె పురుగు లాంటి నరాలు, పాదం వేళ్లలో గ్యాంగ్రిన్ రావడం, పాదం, కాళ్లలో పుండ్లు, నలుపు రావడం, ఉబ్బిన నరాలు, అనూరిజమ్స్, రక్తనాళాల వైకల్యం, అర్టెరియోవెనస్ ఫిస్టులా, ధమనుల వ్యాధులు, పెరిపెరల్ అర్టరీ వ్యాధి, లోతైన సిర రక్తం గడ్డకట్టడం, అనారోగ్య సిరలు, పెరిఫెరల్ నరాల వ్యాధి తదితర నరాల వ్యాధులకు సంబంధించి వాస్కులర్ హాస్పిటల్స్ ప్రత్యేక వైద్య నిపుణులతో రూ.5 వేలు విలువైన రక్తనాళాల సర్జన్ కన్సల్టేషన్, వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. అత్యంత ఖరీదైన కలర్ డాప్లర్ టెస్ట్ ఉచితంగా చేయడంతో పాటు కాళ్ల రక్తనాళాల్లో క్లాట్స్ ఉన్నవారికి రూ.వేలు విలువైన లేజర్ ట్రీట్మెంట్ ఆపరేషన్ ఉచితంగా చేయించబడునని తెలిపారు. ఇది అరుదైన సేవా శిబిరం అని, కాళ్ల రక్తనాళాల వ్యాధులతో బాధపడుతున్న వారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


కాళ్లలో ఉబ్బిన నరాలు

## పరీక్ష కేంద్రాల పరిశీలన

**సఖినేటిపల్లి:** మండలంలోని పదో తరగతి పరీక్ష కేంద్రాలను గురువారం సమగ్ర శిక్ష సెక్టోరియల్ జిల్లా అధికారి బి.సుబ్రహ్మణ్యం పరిశీలించారు. ఈ మేరకు రామేశ్వరం, అంతర్వేదిపాలెం, కేశవదాసుపాలెం, మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలలోని సెంటర్లను, సఖినేటిపల్లి లూథరన్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల సెంటర్‌ను పరిశీలించారు. ఈ నెల 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు. రామేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. టీచర్ల సూచనలు పాటించి మంచి మార్కులతో ఉత్తీర్ణత కావాలని సూచించారు. ఎంఈఓ–1 డి.కిషోర్ కుమార్, ఎంఈఓ–2 మద్దాలి వెంకటేశ్వరరావు, హెచ్ఎంలు సుగుణ, శ్రీనివాస్, శ్రీధర్‌కృష్ణ, రమేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.


రామేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ముఖాముఖి నిర్వహిస్తున్న సుబ్రహ్మణ్యం

**నగరంలో...**

**మామిడికుదురు:** ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను తీర్చిదిద్దేందుకు చొరవ చూపాలని సమగ్ర శిక్ష జిల్లా సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం సూచించారు. నగరం గ్రామంలోని మొల్లేటివారి మెరక ఇంక్లూసివ్ ఎడ్యుకేషన్ రీసోర్స్ సెంటర్‌ను ఆయన గురువారం సందర్శించారు. అక్కడ ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల బోధనను పరిశీలించారు. వారి కోసం ప్రత్యక్షంగా అమలు చేస్తున్న వివిధ విధానాలను పరిశీలించారు. విద్యార్థులతో ఇంటరాక్ట్ అయ్యారు. ప్రత్యేక అవసరాలు కలిగిన వారికి బోధించే సమయంలో వారికి సులభంగా అర్థమయ్యే రీతిలో బోధన జరగాలన్నారు. వారిపై చిన్న పిల్లల కన్నా ఎక్కువ శ్రద్ధ చూపాలని సీఎంఓ సూచించారు. కార్యక్రమంలో ఐఈఆర్పీలు కె.సుశీల, ఎన్.హిమబిందు పాల్గొన్నారు.

# రుణాల మంజూరుకు దరఖాస్తుల స్వీకరణ

**ఆలమూరు:** మండలంలోని వివిధ గ్రామాల్లో అర్హులైన బీసీ, ఈబీసీ లబ్ధిదారులకు స్వయం ఉపాధి పథకాలను మంజూరుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రామచంద్రపురం ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ, స్థానిక ఎంపీడీఓ ఎ.రాజు అన్నారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను బీసీ వర్గాలతో పాటు ఆర్థికంగా వెనుకబడి ఉన్న లబ్ధిదారులకు వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణాలను మంజూరు చేస్తామన్నారు. బీ–ఫార్మసీ, డీ–ఫార్మసీ విద్యార్హత ఉన్న యువతతో పాటుగా వృత్తి పరమైన కమ్మరి, కుమ్మరి, మేదర వంటి సామాజిక వర్గాల అభ్యున్నతి కోసం రాయితీపై రుణాలను అందించనున్నామన్నారు. అలాగే కాపు సామాజిక వర్గం లబ్ధిదారులకు ఎంఎస్ఎంఈ పథకం ద్వారా చిన్న పరిశ్రమలు స్థాపించుకొనుటకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మహిళల అభ్యున్నతి కోసం 18 నుంచి 50 యేళ్ల లోపు మహిళలకు ఉచిత కుట్టుమెషీన్ శిక్షణ ఇచ్చి మెషీన్లను ఉచితంగా అందజేస్తామన్నారు. ఈ పథకాలకు సంబంధించి అర్హులైన లబ్ధిదారులు మీ–సేవ ద్వారా లేదా స్థానిక గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాల కోసం మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని సంప్రదించాలని డీఎల్‌పీఓ పేర్కొన్నారు. మండల పరిషత్ ఏవో మెహర్ ప్రకాష్, సీఏ ఎస్‌కే వలీ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మొల్లమాంబ జయంతి

**అంబాజీపేట:** సంస్కృతంలో ఉన్న రామాయాన్ని మొల్లమాంబ తనదైన శైలిలో సామాన్య ప్రజలకు అర్థమయ్యే రీతిలో తెలుగు పదాలతో రచించారని, కాలక్రమేణ ఆ రామాయణం మొల్ల రామాయణంగా పేరుగాంచి ఆదర్శంగా నిలిచారని జిల్లా శాలివాహన సంఘ సలహాదారుడు దొడ్డిపట్ల శ్రీనివాస్ అన్నారు. మాచవరంలో కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘ భవనం వద్ద సంఘం ఆధ్వర్యంలో ఆతుకూరి మొల్లమాంబ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ తన రచనలతో అన్నమాచార్య భార్య తిమ్మక్క తర్వాత రెండో మహిళా రచయిత్రిగా పేరుగాంచారన్నారు. ఆమె రచనలను విదేశీ రచయితల సైతం ప్రశంసించారు. తొలుత మొల్ల విగ్రహం వద్ద పలువురు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి కేకు కట్ చేశారు. అనంతరం జిల్లా సంఘ అధ్యక్షులు మానేపల్లి వీరబ్రహ్మం సమకూర్చిన చీరలను మహిళలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆదుర్తి నారాయణమూర్తి, కోటిపల్లి సత్యనారాయణ, రామకృష్ణ, కొడమంచిలి సూరిబాబు, మంతెన శ్రీనివాస్, చిరతపూడి హేమలత, మంతిన లక్ష్మి పాల్గొన్నారు.

**ఆలమూరులో..**

**ఆలమూరు:** అచ్చ తెలుగు నుడికారంతో సామాన్యులకు అర్థమయ్యే రీతిలో రామాయణాన్ని రచించి ప్రజలకు అంకితం చేసిన కవయిత్రి మొల్లమాంబ గొప్ప దార్శనికురాలని మండల శాలివాహన సంఘం అధ్యక్షులు మల్లవరపు మల్లేశ్వరరావు అన్నారు. ఆలమూరులో శాలివాహన సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ప్రముఖ కవయిత్రి మొల్లమాంబ జయంతినిగ్రామానికి చెందిన వ్యాపారవేత్త వంటిపల్లి పాపారావు, ఏఎంసీఎస్ మాజీ అధ్యక్షుడు వంటిపల్లి సతీష్ ముఖ్య అతిథిలుగా పాల్గొని ప్రసంగించారు. రామాయణాన్ని సరళంగా రచించి శ్రీకృష్ణదేవరాయలు మన్ననలు పొందిన కవయిత్రి మొల్ల జీవితం అందరికీ ఆదర్శమన్నారు. అనంతరం మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, స్టేషనరీ సామగ్రిని అందజేశారు. మాజీ జెడ్పీటీసీ రామానుజుల శేషగిరిరావు, గంగుల వీరబాబు, కడియాల శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.


మాచవరం కుమ్మరిపాలెంలో మొల్ల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సంఘ నాయకులు

**రాజోలులో..**

**రాజోలు:** కవయిత్రి మొల్లమాంబ జయంతిని గురువారం రాజోలు కాటన్‌పార్కులో శాలివాహన సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కవయిత్రి మొల్లమాంబ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సంఘ నాయకుడు పుల్లేటికుర్తి వెంకటేశ్వరరావు పలువురు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. సర్పంచ్ రేవు జ్యోతి, ఉప సర్పంచ్ పామర్తి రమణ, నాయకులు పాల్గొన్నారు.